## పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రత : ఎస్పీ నరసింహ

అంజలి స్కూల్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేట అర్బన్, మార్చి 21: జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ నరసింహ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కేంద్రాల వద్ద పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్‌తో ఏ అధికారిని అనుమతించొద్దని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రవీణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా

సూర్యాపేట టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్, ఐటీ సెల్, సైబర్ సెక్యూరిటీ సెల్, సోషల్ మీడియా మానిటరింగ్ యూనిట్లను బలోపేతం చేశామని ఎస్పీ కె.నరసింహ తెలిపారు. శుక్రవారం సైబర్ సెక్యూరిటీ సెల్, ఐటీ సెల్, కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. సామాజిక మాధ్యమాలపై జిల్లా పోలీస్ శాఖ నిఘాను పటిష్టం చేసినట్లు వివరించారు. సోషల్ మీడియాను వినియోగించేప్పుడు జాగ్రత్తలు పాటించాలని, మార్ఫింగ్ చిత్రాలు, నకిలీ పత్రాలు, ప్రజలను రెచ్చగొట్టే సమాచారం, ఇతరుల మనోభావాలు కించపరిచే సమాచారం వ్యాప్తి చేయడం చట్టరీత్యా నేరమన్నారు. జైలు శిక్ష, జరిమానా తప్పదని హెచ్చరించారు. ఎస్పీ వెంట ఏఆర్ అదనపు ఎస్పీ జనార్ధన్‌రెడ్డి, ఆర్ఐ నరసింహ, ఆర్ఎస్ఐలు రాజశేఖర్, సాయిరాం, సిబ్బంది ఉన్నారు.

## లైంగిక దాడి కేసులో నిందితులకు రిమాండ్

హుజూర్‌నగర్, మార్చి 21: లైంగిక దాడి కేసులో నిందితులను హుజూర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ చరమందరాజు కేసు వివరాలను వెల్లడించారు. మఠంపల్లి మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన స్వామి రోజా అనే మహిళ భర్త చనిపోవడంతో పిల్లలతో కలిసి హుజూర్‌నగర్‌లో జీవనం సాగిస్తుంది. ఏడు నెలల క్రితం ఆమెకు హుజూర్‌నగర్‌లోని తిలక్ నగర్‌కు చెందిన నూకతొట్టి ప్రమోద్‌కుమార్, లచ్చిమళ్ల హరీశ్ పరిచయం కాగా, ప్రమోద్‌తో శారీరక సంబంధం ఏర్పడింది. ఈ క్రమంలోనే రోజాకు మేళ్లచెర్వుకు చెందిన ఓ యువతి పరిచయమైంది. సదరు యువతిని ప్రమోద్‌కుమార్, హరీశ్‌కు పరిచయం చేసింది. అప్పుడప్పుడు అందరూ కలిసి మాట్లాడుకునేవారు. కాగా, సదరు యువతిపై కన్నేసిన ప్రమోద్‌కుమార్ ఈ నెల 7న మాట్లాడాలని చెప్పి ఆమెను ఓ లాడ్జికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడుతూ వీడియో, ఫొటోలు తీసుకున్నాడు. ఈ విషయాన్ని హరీశ్‌కు చెప్పాడు. కాగా, ఈ నెల 18న ప్రమోద్, హరీశ్ కలిసి రోజా సాయంతో యువతిని ఆమె ఇంటికి పిలిపించారు. యువతి రోజా ఇంటికి రాగానే ముగ్గురు కలిసి బలవంతంగా కారులో ఎక్కించుకొని రిజిస్ట్రేషన్ ఆఫీస్ వైపు తీసుకెళ్లారు. ప్రమోద్, హరీశ్ యువతిపై లైంగిక దాడికి యత్నించారు. తమకు సహకరించకపోతే ఫొటోలు, వీడియోలు బయటపెడతామని బెదిరించారు. అయినా యువతి ప్రతిఘటించడంతో కర్రలతో కొట్టి, బట్టలు చింపివేశారు. ఆ తర్వాత యువతి ఏమైనా చేసుకుంటుందేమోనన్న భయంతో వదిలేశారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం ప్రమోద్‌కుమార్, రోజా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. హరీశ్ కుమార్ పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. ఎస్ఐ ముత్తయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## 'ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వం'

సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

సూర్యాపేట టౌన్, మార్చి 21: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, ఒకే దేశం, ఒకే భాష, ఒకే ఎన్నిక పేరుతో ప్రజల మధ్య ఐక్యత లేకుండా విద్వేషాలు రెచ్చగొడుతున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎంవీఎన్ భవన్‌లో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం జిల్లా కమిటీ, మండల కార్యదర్శుల సంయుక్త సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోదీ ప్రభుత్వ తీరు కార్పొరేట్ శక్తులకు ప్రయోజనం చేకూర్చేలా ఉందని ఆరోపించారు. బీజేపీయేతర రాష్ట్రాలపై కక్ష గట్టి అభివృద్ధికి నిధులు ఇవ్వడం లేదని అన్నారు. రాష్ట్రాల హక్కులను హరిస్తూ కేంద్రమే పెత్తనం చేయాలని చూస్తుందన్నారు. పెరుగుతున్న ధరలను, నిరుద్యోగాన్ని అదుపు చేయడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. కాగా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఖజానాలో నిధులు లేవని, దీంతో ఆరు గ్యారెంటీలను అమలు చేయలేకపోతున్నామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు ఆశించిన పాలన సాగడం లేదని విమర్శించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట గోపి, మేక నబోయిన శేఖర్, వేల్పుల వెంకన్న, జె.నరసింహరావు, బుర్ర శ్రీనివాస్, కందాల శంకర్‌రెడ్డి, పులుసు సత్యం, పల్లె వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


**శ్రీ యల్లమ్మ అమ్మవారి దేవస్థానము**
దేవాదాయ - ధర్మాదాయ శాఖ
గ్రా॥ దర్వేశిపురం (పర్వతగిరి), మం॥కనగల్, జి॥నల్లగొండ.

తేది: 18.03.2025

**టెండర్ కం-బహిరంగ వేలము ప్రకటన**

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా పై దేవస్థానము వద్ద తేది:24-03-2025 సోమవారం రోజున మ॥గం॥1-00లకు నుండి ఈ క్రింద పేర్కొనబడిన వేలములు 2025-2026 (1) సం॥నకు దేవాలయ ప్రాంగణంలో వేలము నిర్వహించబడును. ఆసక్తిగలవారు పాటలో పాల్గొనవలసిందిగా కోరనైనది.

| క్ర.సం | వేలము వివరములు | కాల పరిమితి 1 సం॥ | డిపాజిట్ డబ్బు | టెండర్ షెడ్యూల్ ధర | రిమార్క్స్ |
|---|---|---|---|---|---|
| 1 | తలనీలాలు సేకరణ హక్కు | తేది:1-04-2025 నుండి తేది:31-03-2026 వరకు | 3,00,000-00 | 1000-00 | ఏపేట తపీయ బ్యాంకేతో Telangana Grameena Bank సహకార సంఘం పెట్టాలు అప్పటికి ఓ.డి. తీయవలెను. |
| 2 | వాహనాలకు బొట్టుపెట్టుకొను హక్కు | తేది:1-04-2025 నుండి తేది:31-03-2026 వరకు | 2,00,000-00 | 1000-00 | |
| 3 | కొబ్బరి చిప్పల సేకరణ హక్కు | తేది:1-04-2025 నుండి తేది:31-03-2026 వరకు | 1,00,000-00 | 1000-00 | |
| 4 | చీరలు-పదిబియ్యం సేకరించుకొను హక్కు | తేది:1-04-2025 నుండి తేది:31-03-2026 వరకు | 1,00,000-00 | 1000-00 | |

నోటు: డిపాజిట్/నగదు డి.డి.లు మాత్రమే స్వీకరించబడును. డి.డిలు కార్యనిర్వహణాధికారి శ్రీ యల్లమ్మ దేవస్థానము, గ్రా॥ దర్వేశిపురం పేరు మీద తీయవలెను.

చీదేటి వెంకట్‌రెడ్డి
చైర్మన్ & ధర్మకర్తల మండలి, సెల్: 9441562155

శ్రీ జిల్లేపల్లి జయరామయ్య
కార్యనిర్వహణాధికారి, సెల్:9951999438

వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 90000 10884, 9949609848



నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**CHANGE OF NAME & SURNAME**
I Kakunuri Venkat Reddy, S/o: Nagireddy Kakunuri, R/o: H.No. 5-146H/B, Bus Stand Center, Chinthalapalem Village, Chinthalapalem Mandal, Suryapet District, Telangana State, Pincode: 508246, India, Changed My Name and Surname from Kakunuri Venkata Reddy, S/o: Nagi Reddy Kakunuri, to Kakunuri Venkat Reddy, S/o: Nagireddy Kakunuri. Cell : 9949247738.

**WANTED**
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330663-All

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | చౌటుప్పల్: 9182777638


## జూన్ నాటికి విద్యార్థుల యూనిఫామ్ సిద్ధం చేయాలి

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, మార్చి 21: విద్యార్థులకు ప్రభుత్వం అందజేసే యూనిఫామ్‌ను జూన్ నాటికి సిద్ధం చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. యూనిఫామ్ తయారీపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డీఆర్‌డీఏ, డీఈఓ, సంక్షేమ అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్య, వారి కొలతల మేరకు యూనిఫామ్ కుట్టించాలని సూచించారు. పాఠశాలల సంఖ్య, వారికి కేటాయించిన ఎస్ హెచ్‌జీ గ్రూప్‌ల వివరాలు, విద్యార్థుల సంఖ్యపై నివేదికను అందించాలని ఆదేశించారు. ప్రతి కుట్టు కేంద్రంలో పది మంది మహిళలు దుస్తులు తయారు చేసేందుకు అవసరమైన కుట్టు యంత్రాలు ఉన్నాయా లేవా అనే వివరాలను తెలుసుకోవాలని అన్నారు. జూన్‌లో పాఠశాలల ప్రారంభం నాటికి పూర్తి చేయాలని, నెలాఖరులో విద్యార్థులకు అందించాలన్నారు. కాగా, జిల్లాలో 37 కేంద్రాలు ఉన్నాయని, వాటిలో 475 మంది ట్రైనర్స్ సిద్ధంగా ఉన్నారని ఐడీపీ రామ్‌సురేశ్ తెలిపారు. డీఈఓ అశోక్, సంక్షేమ అధికారులు నరసింహారావు, శంకర్, లత, శ్రీనివాస్‌నాయక్, డీపీఎం అంజనేయులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ 'ఆత్మీయ భరోసా' వర్తింపజేయాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు నవీన్‌కుమార్

నేరేడుచర్ల, మార్చి 21: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ మేరకు అర్హులందరికీ తక్షణమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింపజేయాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు రాపోలు నవీన్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని జానల్‌దిన్నె గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ కూలీలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల్లో భాగంగా వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ. 12 వేలు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇంత వరకు అమలు చేయడం లేదన్నారు. జాబ్ కార్డు ఉండి ఉపాధి హామీ పనులు చేస్తున్న వారికే ఈ పథకాన్ని వర్తింపజేయాలని చూస్తున్నారని, అలా కాకుండా అర్హులందరికీ లబ్ధి చేకూర్చాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు జిలకర రామస్వామి, సోషల్ మీడియా విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు లంకెపల్లి నాగార్జున, రమావత్ అశోక్‌నాయక్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

చిలుకూరు, మార్చి 21: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం తెల్లవారుజామున మండలంలోని సీతారాంపురం గోదాముల వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామానికి చెందిన సంపంగి భాస్కర్ పని నిమిత్తం కోదాడ నుంచి హుజూర్‌నగర్ వైపు వెళ్తున్న క్రమంలో సీతారాంపురం గోదాముల వద్ద బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో భాస్కర్ తలకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం స్థానికులు 108 అంబులెన్స్‌లో హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లారు.

### డివైడర్‌ను ఢీకొట్టిన బైక్..

మునగాల: మండలంలోని ముకుందాపురం గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన సంజయ్ అనే యువకుడు బైక్‌పై కోదాడకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా మార్గం మధ్యలో ముకుందాపురం గ్రామంలో 65వ నంబర్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని తప్పించబోయి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సంజయ్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం స్థానికుల సాయంతో సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## నెమ్మికల్ రామాలయంలో చోరీ

ఆత్మకూర్.ఎస్, మార్చి 21: నెమ్మికల్ రామాలయంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు రామాలయంలోని గర్భగుడి తలుపులు పగులగొట్టి హనుమాన్ వెండి విగ్రహాన్ని, మరికొన్ని వెండి వస్తువులను అపహరించారు. వాటి విలువ సుమారు రూ.1.20 లక్షలు ఉంటుందని తెలిపారు. అదేవిధంగా మండలంలోని కోటినాయక్ తండాలో కోమటిరెడ్డి ఉపేందర్‌రెడ్డి అనే వ్యక్తి ఇంట్లో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 3 తులాల బంగారం, రూ.10 వేల నగదు అపహరించారు. ఉపేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు హైదరాబాద్ వెళ్లగా, ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీ జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఉపేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

## ఘనంగా 'వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్'

సూర్యాపేట అర్బన్, మార్చి 21: జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం చైర్మన్, ప్రిన్సిపాల్ వి.వెంకటేశులు, ఎంజీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పసుపుల మద్దిలేటి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా 127 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారని, అనంతరం వారికి వివిధ కేటగిరీల్లో నిర్వహించిన నైపుణ్య పరీక్షల్లో ప్రతిభ చూపిన 10 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్స్ మధు, సృజన, జిల్లా క్రీడల అధికారి జి.రాంచందర్‌రావు, ప్రవీణ్‌కుమార్, ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీల తదితరులు పాల్గొన్నారు.

## 'సహకార సంఘం అభివృద్ధికి సహకరించాలి'

చిలుకూరు, మార్చి 21: చిలుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి రైతులు సహకరించాలని చైర్మన్ అల్సకాని జనార్ధన్ కోరారు. శుక్రవారం చిలుకూరులోని పీఏసీఎస్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలను అందిస్తున్నామని, తిరిగి సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఎరువులు సరైన సమయంలో అందిస్తూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గన్నా పద్మావతి, సీఈఓ చిలువేరు లక్ష్మీనారాయణ, డైరెక్టర్లు కొడారు రాంబాబు, కస్తూరి సైదులు, నాగరాజు, శ్రీహరి, రాములు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## సీఐటీయూ నాయకుల ముందస్తు అరెస్ట్

గరిడేపల్లి: పోలీసుల అదుపులో సీఐటీయూ నాయకులు

మునగాలలో పోలీసుల అదుపులో నాయకులు

మేళ్లచెర్వు, మార్చి 21: హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద శుక్రవారం రవాణా కార్మికులు, బిల్డింగ్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులు తదితర అసంఘటిత రంగ కార్మికులు తలపెట్టిన ధర్నాకు బయలుదేరకుండా సీఐటీయూ, సీపీఎం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. మేళ్లచెర్వులో అదుపులోకి తీసుకున్న వారిలో సీపీఎం మండల కార్యదర్శి వట్టెపు సైదులు, ఆదినారాయణ ఉన్నారు.

మఠంపల్లి: సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ రస్‌మియాను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు.

పాలకవీడు: మండలంలో సీఐటీయూ నాయకుడు అనంత ప్రకాశ్‌ను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

గరిడేపల్లి: మండలంలో సీఐటీయూ నాయకుడు యాకూబ్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కొండ సైదులుగౌడ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

మునగాల: మండలంలో అరెస్టయిన వారిలో షేక్ సైదా, దస్తగిరి, జాన్ పాషా, వెంకటేశ్వర్లు ఉన్నారు.

నడిగూడెం: సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, సీఐటీయూ మండల కన్వీనర్ వెంకన్న, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాసాని కిశోర్, చిమట నాగరాజు, జమ్మి ఎల్లయ్య తదితరులను అదుపులోకి తీసుకున్నారు.

పెన్‌పహాడ్: సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణను పోలీసులు లింగాల గ్రామంలో అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

## విలేకరుల పేరుతో బెదిరించిన వ్యక్తులపై కేసు

మఠంపల్లి, మార్చి 21: విలేకరుల పేరుతో తాసీల్దార్ కార్యాలయ సిబ్బందిని బెదిరించిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండల కేంద్రం మఠంపల్లికి చెందిన కాంపాటి సందీప్ అనే వ్యక్తి రాజ్ న్యూస్ విలేకరిని అని చెప్పి ఇటీవల స్థానిక తాసీల్దార్ కార్యాలయంలోకి వెళ్లి సిబ్బందితో దురుసుగా మాట్లాడి వారి విధులకు ఆటంకం కలిగించాడు. ఫొటోలు, వీడియోలు తీసి నిఘా న్యూస్ విలేకరిగా చెప్పుకుంటున్న వెంకట్ యాదవ్ అనే వ్యక్తికి వాటిని పంపగా సోషల్ మీడియాలో పెట్టి సిబ్బంది బెదిరిస్తున్నారు. ఈ విషయమై తాసీల్దార్ మంగా రాథోడ్ శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పి.బాబు తెలిపారు.

## పేకాడుతున్న నలుగురి అరెస్ట్

పాలకవీడు, మార్చి 21: మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామంలో పేకాడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. గుడుగుంట్లపాలెంలోని అనంతుల నరేందర్ అనే వ్యక్తి ఇంట్లో పేకాడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు శుక్రవారం దాడి చేశారు. అనంతుల నరేందర్, చింతలచెర్వు సీతారాం, ఆరుట్ల భిక్షం, ఉయ్యాల సోమయ్య అనే వ్యక్తులు పేకాడుతూ పట్టుబడ్డారు. వారిని అరెస్ట్ చేసి రూ.11,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## చిత్తుబొత్తు ఆడుతున్న ఆరుగురిపై కేసు

గరిడేపల్లి, మార్చి 21: మండల కేంద్రంలోని పలుగురాయి డొంక దారిలో శుక్రవారం కొందరు వ్యక్తులు చిత్తుబొత్తు ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. రామిరెడ్డి , షేక్ సాధిక్, రాజేశ్, అరవింద్, అనిల్, లింగరాజు అనే వ్యక్తులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. 3 బైక్‌లు, 5 సెల్‌ఫోన్లు, రూ.3,490 నగదు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చలికంటి నరేశ్ తెలిపారు.

## పొలానికి మందుకొడుతూ గుండెపోటుతో రైతు మృతి

పెన్‌పహాడ్, మార్చి 21: గుండెపోటుతో రైతు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని దోసపహాడ్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దోసపహాడ్‌కు చెందిన కొండేటి వెంకటరెడ్డి (54) శుక్రవారం ఉదయం తన పొలంలో క్రిమిసంహారక మందు కొడుతుండగా గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతిచెందారు. వెంకటరెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## ఆత్మగౌరవ సభ పోస్టర్ ఆవిష్కరణ

తిరుమలగిరి, మార్చి 21: ఈ నెల 29న జిల్లా కేంద్రం సూర్యాపేటలో నిర్వహించనున్న మాలల ఆత్మగౌరవ సభ పోస్టర్‌ను మాల మహానాడు నాయకులు శుక్రవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఆత్మగౌరవ సభలో మాలలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ గంట యాకూబ్, నాయకులు గంట సందీప్, ప్రభుదాస్, నర్సయ్య, సాల్మన్, సుధాకర్, ప్రకాశ్, పుష్ప, రేణుక, దయామణి తదితరులు పాల్గొన్నారు.

## మామిండ్లమడవలో పశువుల కొట్టం దగ్ధం

మద్దిరాల, మార్చి 21: మండలంలోని మామిండ్లమడవ గ్రామంలో ఉప్పల సోమయ్య అనే రైతుకు చెందిన పశువుల కొట్టం శుక్రవారం దగ్ధమైంది. గ్రామంలోని తన వ్యవసాయ భూమిలో పశువుల కొట్టాన్ని ఏర్పాటు చేసుకున్నానని, కొట్టానికి దగ్గరగా ఉన్న త్రీ ఫేస్ విద్యుత్ తీగలు గాలికి ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలు కొట్టంపై పడడంతో దగ్ధమైందని రైతు సోమయ్య తెలిపారు. ప్రమాద సమయంలో కొట్టంలో పశువులు లేవని, వ్యవసాయానికి ఉపయోగించే సామగ్రి, ఎరువుల బస్తాలు, పైపులు తదితర సామగ్రి కాలిపోయాయని, మొత్తం రూ.30 వేల వరకు నష్టం జరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

## దళిత నాయకుడిపై అక్రమ కేసును ఖండిస్తున్నాం

● న్యాయవాదులు హసన్, మల్లయ్య

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాదులు హసన్, మల్లయ్య

నాగారం, మార్చి 21: మండలంలోని వర్ధమానుకోట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ దళిత నాయకుడు ఈదుల కిరణ్‌పై అక్రమంగా కేసు పెట్టడాన్ని ఖండిస్తున్నామని దళిత న్యాయవాదులు తలమల్ల హసన్, డపుకు మల్లయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈదుల కిరణ్‌ను అనేకమార్లు కులం పేరుతో దూషించిన అదే గ్రామానికి చెందిన యువకుడు భరత్, ఆయన అనుచరులపై నాగారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. తిరిగి కిరణ్‌పైనే అక్రమ కేసు నమోదు చేసి వేధిస్తున్నారని ఆరోపించారు. కులం పేరుతో దూషించిన యువకుడిపై అట్రాసిటి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేసు విషయంలో కాంగ్రెస్ నాయకులు రాజకీయ రంగు పూస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తుందని, కిరణ్‌కు న్యాయం జరుగకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు. సమావేశంలో దళిత న్యాయవాదులు చిప్పలపల్లి చిరంజీవి, జిలకర చంద్రమౌళి, అనుములపురి సైదులు, మీసాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ దళిత నాయకుడిపై వేధింపులను మానుకోవాలి

● బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఉప్పలయ్య

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నాగారం, మార్చి 21: బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు, వర్ధమానుకోట గ్రామానికి చెందిన దళిత నాయకుడు ఈదుల కిరణ్‌కుమార్‌పై వేధింపులు మానుకోవాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపక్ష నాయకులపై కక్షపూరితంగా కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. వర్ధమానుకోట గ్రామానికి చెందిన దళిత యువ నాయకుడు ఈదుల కిరణ్‌కుమార్ బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తుండడంతో ఓర్వలేని గ్రామానికి చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు అతనిపై కేసు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా కిరణ్‌పై కేసు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుండగాని అంబయ్య, బీఆర్ఎస్ తుంగతుర్తి మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య, నాయకులు చిల్లర చంద్రమౌళి, పొదిల రమేశ్, కూరం వెంకన్న, దోమల బాలమల్లు, ఈరేటి అంజి, కన్న